క్లుప్తంగా

మూల పెద్దమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: స్థానిక మూల పెద్దమ్మకు మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

గడివేముల: జాతీయ పశువ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని బూజునూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. దాదాపు 200 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ సాయిహరిణి తెలిపారు. వచ్చే నెల 15వ వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఈ మధుసూదన్, సిబ్బంది

పాణ్యం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరురూ పాణ్యం విద్యుత్ సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మధుసూదన్ మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 17, 18తేదీలలో భోజన విరామంలో నిరసన తెలుపుతామన్నారు. 19, 20 తేదిలో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు.

కోతదశ వచ్చే వరకు వేచి ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

కల్లూరు: మండలంలోని రైతులు ఉల్లి పంట కోతదశ వచ్చే వరకు కోత కోయకూడదని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నాయకల్లు, కొంగనపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు పలు సూచనలు చేశారు. ఉల్లి పంట సాగు చేసిన ప్రతి రైతులు రెండు రోజుల్లో తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు.

పశువులను కాపాడుకోండి



టీకా వేస్తున్న పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి

కల్లూరు: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి వాటిని కాపాడుకోవాలని చిన్నటేకూరు పశువైద్యశాల డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాడిరైతులకు సూచించారు. మంగళవారం చిన్నటేకూరులో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. వచ్చే నెల 15 వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పదోన్నతిపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలో 11 నెలల పాటు ఎంపీడీఓగా విధులు నిర్వహించి, డీడీఓగా పదోన్నతిపై నంద్యాల జిల్లాకు వెళ్తున్న శ్రీనివాసులును మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ తిప్పన, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్ గౌడు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ఎంపీడీఓగా శ్రీనివాసులు మండలానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులకు సోలార్ షాక్!

- పండ్ల తోటలకు పరిహారం చెల్లించకుండానే విద్యుత్ టవర్ల నిర్మాణం
- గగ్గోలు పెడుతున్న గుడుంబాయి తండా రైతులు
- పోలీసులను అడ్డుపెట్టుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్న కంపెనీ

ఓర్వకల్లు: హైటెన్షన్ సోలార్ విద్యుత్ స్తంభాల నిర్మాణంతో గిరిజను భూములకు ముప్పువాటిల్లుతోంది. గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో ఓర్వకల్లు, పాణ్యం మండలాల మధ్య సుమారు 3 వేల ఎకరాల విస్తీర్ణంలో బహుళార్థక సోలార్ విద్యుత్ పరిశ్రమను స్థాపించిన విషయం విధితమే. ఈ పరిశ్రమ నిర్వహణకు అవసరమైన విద్యుత్ వినియోగం కోసం హుసేనాపురం వద్ద విద్యుత్ నిల్వ కేంద్రాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా పిన్నాపురం వద్ద ఉత్పత్తి చేస్తున్న సోలార్(సూర్య విద్యుత్)ను విద్యుత్ నిల్వ కేంద్రానికి సరఫరా చేస్తారు. ఈ క్రమంలో పిన్నాపురం నుంచి గుడుంబాయి తండా మీదుగా హుసేనాపురం వరకు 765 కిలో వాట్స్ సామర్థ్యం సోలార్ విద్యుత్ తీగలను లాగుతున్నారు. వీటి కోసం విద్యుత్ టవర్లను నిర్మిస్తున్నారు. టవర్ల నిర్మాణంలో గుడుంబాయి తండాకు చెందిన సుమారు 150 ఎకరాల మేర భూములను గిరిజనులు కోల్పోతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ విద్యుత్ టవర్ల నిర్మాణ బాధ్యతలను 'మేఘా' కంపెనీ వారికి అప్పగించారు. సదరు కంపెనీ వారు రైతుల అనుమతి తీసుకోకుండానే నెల రోజుల నుంచి టవర్లు నిర్మిస్తుండడంతో గిరిజన రైతుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

పంచాయతీ తీర్మానం లేకుండానే..

ఏదైనా అభివృద్ధి పనులను మొదలు పెట్టకముందే భూయజమానుల అనుమతులతో పాటు గ్రామ పంచాయతీ తీర్మానం పొందాల్సివుంది. కానీ మేఘా కంపెనీ వారు నిబంధనలకు పాతరేసి రైతుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే టవర్ల నిర్మాణానికి ఉపక్రమించారు. దీంతో రైతుల్లో ఆందోళనతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సదరు కంపెనీ వాళ్లు టవర్ల నిర్మాణంలో కోల్పోయిన భూములకు పరిహారం చెల్లించారు. టవర్ల కింద కోల్పోయిన 4 సెంట్ల స్థలానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించి, సదరు భూముల్లో సాగుచేసిన చీనీ, సపోట, మామిడి, కొబ్బరి తదితర పండ్లతోటలకు నిర్దేశించిన పరహారం చెల్లించాలని అధికారులు కంపెనీ వారితో ఒప్పందం కుదిర్చారు. ఈ నేపథ్యంలో మామిడి చెట్టుకు రూ.7,500, సపోటకు రూ.3,600, చీనీకి రూ.3,700, కొబ్బరి చెట్టుకు రూ.3,000ల చొప్పున పరిహారం చెల్లిస్తామని రైతులను ఒప్పించారు. పనులు మొదలు పెట్టి నెల రోజులైనా ఇంతవరకు పైసా పరిహారం చెల్లించకుండానే విద్యుత్ తీగలను దౌర్జన్యంగా లాగుతున్నారు. దీంతో ఒక్క సారిగా వ్యతిరేకత నెలకొంది. ఈ క్రమంలో విద్యుత్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఎవరైతే తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తారో? అలాంటి రైతుల వద్దకు పోలీసులను పంపి బెదిరింపులకు పాల్పడుతుండడం విమర్శలకు తావిస్తోంది. కంపెనీ వారు చెప్పినట్లుగా అక్కడికి వెళ్లిన పోలీసులు గిరిజనులను రెచ్చగొట్టడం, భయభ్రాంతులకు గురిచేస్తూ మరింత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు. విద్యుత్ టవర్ల నిర్మాణంతో ఒక టవర్ నుంచి మరో టవర్‌కు మధ్య సుమారు 46 మీటర్ల వెడల్పు, 50 మీటర్ల పొడవు దూరంలో ఎలాంటి పంటలు పండవని, తీగల రేడియేషన్ కారణంగా పశువులకు, మనుషులకు ప్రమాదం సంభవించే అవకాశాలుంటాయని కంపెనీ వారే చెప్పినట్లు సమాచారం.



సారవంతమైన భూమిలో విద్యుత్ టవర్ నిర్మించిన దృశ్యం

నా కుమారులను బెదిరిస్తున్నారు



మేము 970/ఏ1లో పండ్ల తోటలను సాగు చేసుకున్నాము. మేఘా కంపెనీ వారు విద్యుత్ టవర్లు నిర్మిస్తున్నారు. నా కొడుకులు వద్దన్నందుకు పోలీసులను పంపించి బెదిరిస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. టవర్లకు పట్టా భూములే తీసుకోవాలా? ప్రభుత్వ బంజరు భూములను తీసుకోవాలి.

– జమికీబాయి, మహిళా రైతు, గుడుంబాయి తండా

భయపెట్టడం సరికాదు



మాకు సర్వే నంబర్ 970/ఎ1లో 3.50 ఎకరాల భూమి ఉంది. కొబ్బరి, మామిడి, సపోటా చెట్లను సాగు చేశాం. కొన్ని ఏళ్ల నుంచి సాగుచేసిన చెట్లకు పరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా విద్యుత్ టవర్‌ను నిర్మించారు. టవర్‌కు మాత్రం పరిహారం చెల్లించి పండ్ల చెట్లకు చెల్లించకుండా పనులు చేస్తున్నారు. విద్యుత్ టవర్ కింద ఎకరా పొలం పోతే రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తుంది. పరిహారం చెల్లించి పనులు చేయాలని అడిగితే పోలీసులతో బెదిరిస్తున్నారు. మా పొలాలను తీసుకొని మమ్మల్నే భయపెడతారా? ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– మత్రునాయక్, బాధిత రైతు, గుడుంబాయితండా

పంటలను పరిశీలించిన జేసీ



ప్యాలకుర్తిలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి పంటలను జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఉల్లి సాగు చేసిన రైతులంతా నాణ్యతగా గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌కు తీసుకొస్తే మంచి ధర లభిస్తుందన్నారు. ఉల్లి పంటకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1200 మద్దతు ధర ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని, రూ.2 వేలు మద్దతు ధర కల్పించాలంటూ రైతులు జేసీని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధరకు ఉల్లి పంటను అమ్మినా సగం పెట్టుబడులకు గిట్టుబాటు కావడం లేదని, ఇలాగైతే తమకు తీవ్ర నష్టాలు తప్పవని రైతులు వాపోయారు. కోడుమూరు తహసీల్దార్ నాగరాజు, ఏఓ రవిప్రకాష్, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, ప్యాలకుర్తి రైతులు ఉన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

సి.బెళగల్: మండలంలో అధ్వానంగా మారిన ప్రధాన రోడ్లను ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. మండలంలో పూర్తిగా ధ్వంసమై ప్రయాణాలకు ప్రమాదకరంగా మారిన ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్ల దుస్థితిపై 'సాక్షి' దినపత్రికలో ఈనెల 14వ తేదీ (ఆదివారం) నరక దారులు శీర్షికన కథనం వెలువడింది. మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు, కంబదహల్ గ్రామం వద్ద, పోలకల్ నుంచి ముడుమాల గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు దారుణ పరిస్థితులను కథనంలో ప్రస్తావించారు. అదేవిధంగా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ప్రజల భావనపై 'సాక్షి' కథనం వెలువడడంతో, ఈ మేరకు వారు మంగళవారం స్పందించారు. ఆర్‌అండ్‌బీ డీఈ రమణ, ఏఈ ఫిబి మంగళవారం మండలంలోని ప్రధాన రోడ్లను పరిశీలించి త్వరలో మరమ్మతు పనులు చేపడతామన్నారు. కాంట్రాక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.



కంబదహాల్ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

ఉత్తమ సేవలతో ఉపాధ్యాయులకు గుర్తింపు



కంబదహాల్ మెయిన్ స్కూల్లో సన్మానం పొందిన పదోన్నతి, బదిలీ ఉపాధ్యాయులు

సి.బెళగల్: పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేసే ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. మంగళవారం కంబదహాల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పదోన్నతి, బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులకు హెచ్‌ఎం సునీతాకుమారి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ఉపాధ్యాయ వృత్తిపై మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యార్థుల అభ్యున్నతి పాటుపడితే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎంగా పనిచేసి హైస్కూల్‌కు గ్రేడ్ - 2 హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన నాగన్నను, ఎస్జీటీలుగా పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో హైస్కూల్ హెచ్‌ఎం నాగన్నతో పాటు ఎస్‌జీటీలు మనోజ్, లక్ష్మిపతి ఉన్నారు.

సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్‌ను రద్దు చేయాలి

కల్లూరు: సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం 2004లో పట్టాలు ఇచ్చిందన్నారు. బోర్లు వేసుకుని రైతులు ఏడాదిలో రెండు లేదా మూడు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్ తీసుకుని రైతుల భూముల్లో ప్రవేశించి వారిని ఆందోళనకు గురి చేయడం తగదన్నారు. సీతారామమయ్యకు కొమ్ముకాస్తూ రెవెన్యూ, పోలీసు అధికారులు రైతులను బెదిరించడం సిగ్గుచేటన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో బాధిత రైతులు లక్ష్మన్న, రాజు, నాగరాజు, సునీలమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధిత రైతులు, రైతు సంఘం నాయకులు

వైద్యం వికటించి వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన దాసరి నరహరి (28) మూడు రోజుల కిందట కడుపునొప్పితో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా, అక్కడి వైద్యులు చిన్నపాటి ఆపరేషన్ చేశారు. అయితే కోలుకుంటున్న క్రమంలో మంగళవారం రాత్రి ఆకస్మాతుగా నరహరి మృతిచెందాడు. వైద్యం వికటించడం వల్లే నరహరి మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడు గుండెనొప్పితో మృతి చెందాడంటూ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. మృతుడు నరహరికి భార్య లీలావతితో పాటు, ఏడాదిన్నర వయస్సున్న కుమార్తె సంతానం ఉన్నారు.



మృతి చెందిన నరహరి

పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడ

సి.బెళగల్: మండలంలోని పాఠశాలల్లో మంగళవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రార్థనలో స్వచ్ఛత, పరిశుభ్రత అంశాలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నిర్వహించారు. కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రవీంద్ర విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, వారితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అదేవిధంగా పోలకల్ మెయిన్ స్కూల్లో హెచ్‌ఎం మునిస్వామి, సి.బెళగల్ రెగ్యులర్ స్కూల్ హెచ్‌ఎం సోమశేఖర్ విద్యార్థులతో కలిసి శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యక్తిగత శుభ్రతలో భాగంగా చేతులను శుభ్రం చేసుకునే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



కంబదహాల్ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి శుభ్రం చేస్తున్న హెచ్‌ఎం రవీంద్ర

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి

పాణ్యం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. యూరియా కొరతపై కలెక్టర్‌తో మాట్లాడి సమస్య లేకుండా చేస్తామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ముందుండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గీతా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో స్థల వివాదంపై తహసీల్దార్ వెంకటలక్ష్మి విచారణ చేపట్టారు. గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీలో కొంతమంది మధ్య నెలకొన్న స్థల వివాదంపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ మంగళవారం సర్వే అధికారులతో కలిసి గ్రామానికి చేరుకుని ఫిర్యాదుదారులను, గ్రామస్తులను విచారించారు. అదేవిధంగా కొత్త ఎస్సీ కాలనీ విస్తీర్ణం, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, స్థలాల కేటయింపు, మిగులు స్థలం తదితర అంశాల రికార్డులను, మ్యాప్‌లను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో శేఖర్, గ్రామ సర్వే సహాయకుడు హరి, వీఆర్‌ఏలు ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని సూదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కురువ ఎల్లయ్య (45) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన బి.తాండ్రపాడులోని ఓ ప్రైవేటు కాలేజీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని ముగించుకొని స్వగ్రామం సూదిరెడ్డిపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో రాయలసీమ యూనివర్సిటీ సమీపాన మారుతి హరివిల్లు వెంచర్ మూల టరిన్నింగ్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయలపాలయ్యాడు. స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం తెల్లావారుజామున మృతిచెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. మృతుడికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి కురువ నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

గాలికుంటు నివారణకు టీకాలు

కర్నూలు(రూరల్): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు గార్గేయపురం పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ చెప్పారు. గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పాడి పశువుల్లో సీజనల్‌గా గాలికుంటు వ్యాధి సోకుతుందన్నారు. తద్వారా పశువులు జర్వం, నీరసం, నోటి నుంచి చొంగ కారడం, కాలి గిట్టల మధ్య పుండ్లు వంటి లక్షణాలతో పశువులు బాధపడుతుంటాయన్నారు. దీంతో పాల దిగుబడి తగ్గడం, మేత మేయకపోవడం జరుగుతుందన్నారు. పోతు పశువుల్లో పని సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. వైద్య కేంద్రం పరిధిలోని దిగువపాడు, శివరామాపురం, నందనపల్లె, మిలటరి కాలనీ, భూపాల్ నగర్, వెంకాయపల్లె, పడిదెంపాడు, పూడూరు గ్రామాల్లో పశువులకు దాదాపుగా 450 టీకాలు వేసినట్లు చెప్పారు. వచ్చే నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తారని చెప్పారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం: మండలంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని జిల్లా సేవా సంఘం నాయకులు కొత్రపొలూరు నాగరాజు, రైల్వే శ్రీనివాసులు, కౌలురు శ్రీనివాసులు, ఆలమూరు రామక్రిష్ణ, నెరవాడ సుబ్బయ్య మంగళవారం డీటీ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ధోబీఘాట్‌లు లేక రజకులు ఇబ్బందులు పడుతున్నారని, ధోబీఘాట్లకు అవసరమైన స్థలం కేటాయించి, నీటి వసతి కల్పించాలని కోరారు.

బస్టాండ్లలో మినరల్ వాటర్ ప్లాంట్లు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఏడు ఆర్టీసీ బస్టాండ్లలో ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ బి.నాగరాజు, ఆర్టీసీ కడప జోన్ చైర్మన్ పుల నాగరాజు తెలిపారు. మంగళవారం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఉచిత బస్సు ప్రయాణం పథకంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. కేడీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, ఆర్ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

ఎల్లమ్మకు విశేష పూజలు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి గుగ్గిళ్లు, పిండి వంటలు, భక్ష్యాలు నైవేద్యంగా సమర్పించారు. పలువురు భక్తులు బంతిపూల దండలు, నిమ్మకాయల దండలు, టెంకాయలు, కానుకలు అందజేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్: వర్షాధారంగా ఉల్లి సాగు చేసిన రైతులంతా నిత్యం పంటను పరిశీలిస్తూ ఉండాలని, తెగుళ్ల సోకితే వెంటనే మందులను పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. మంగళవారం వెంకటగిరి గ్రామంలో ఉల్లి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు కురుస్తున్న వేళ ఉల్లి పంటలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఉల్లికి సోకే రసం పీల్చే పురుగు, జీడ ఉధృతిని తగ్గించేందుకు వేపనూనె పిచికారీ చేసుకోవాలని, ఉల్లికి పైపాటుగా వేసే రసాయనిక ఎరువులకు బదులుగా నానో డీఏపీని ఎకరాకు 500 ఎంఎల్ పిచికారీ చేయాలని ఏఓ సూచించారు. గ్రామ రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలంలోని జూలకల్ గ్రామంలో మంగళవారం ఏఓ దస్తగిరి రెడ్డి పత్తి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఉల్లి సాగు చేసిన రైతులంతా కనీసం వంద రోజులు పంట కాలం దాటిన తర్వాతనే ఉల్లి పంటను పీకాలని, తర్వాత 10 రోజుల పాటు పొలంలో బాగా ఆరబెట్టి తేమ లేకుండా చేసిన తర్వాత కోసి మార్కెట్‌కు తరలిస్తే మంచి ధర వస్తుందన్నారు. అలాగే ఉల్లి రైతులంతా ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సూచించారు.



వెంకటగిరిలో ఉల్లి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించండి



సి.బెళగల్‌లో పత్తి రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పత్తి సాగు చేసిన రైతులు పంటల సంరక్షణలో యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం సి.బెళగల్‌లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పత్తి, కంది పంటలను పరిశీలించి వారితో మాట్లాడారు. పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణకు ఎకరాకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలను, పసుపు, తెలుపు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా సామూహికంగా పురుగులను ఆకట్టుకునేందుకు ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు పత్తి పొలంలో ఉంచాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ సలహాలు, సూచనలు చేశారు. రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ హిమబిందు, వీఏఏ అసిఫ్, అంజలి, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చాకే ఉల్లి కోతలు చేపట్టాలి

సి.బెళగల్: రైతులు ఉల్లి పంట పక్వానికి వచ్చిన తరువాతే కోతలు చేపట్టాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. ఆమె మంగళవారం ఏఓతో కలిసి సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో ఉల్లి కోతలను, గ్రేడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఉల్లి రైతులతో మాట్లాడి, పంట పెట్టుబడులకు అయిన ఖర్చులు, దిగుబడి, నాణ్యత, మార్కెట్‌లో రైతులకు లభిస్తున్న ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఉల్లి పంట నాటుకున్న 110 రోజుల తర్వాత పక్వానికి వచ్చాకే కోతలు చేపట్టాలని, కోతల అనంతరం కనీసం 15 రోజులు దిగుబడులను ఎండలో తేమ లేకుండా ఆరబెట్టాలని, గ్రేడింగ్ చేసి నాణ్యమైన ఉల్లి గడ్డలను మాత్రమే మార్కెట్‌కు తరలించాలన్నారు. ఉల్లి సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు పత్రాలను ఆయా గ్రామాల్లోని వ్యవసాయ సిబ్బందితో పొందాలని, ఉల్లి పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సిబ్బందితో వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. వీఆర్వో శేఖర్, వ్యవసాయ సిబ్బంది సునంద, వెంకటేశ్వర్లు, అసిఫ్, రైతులు, వీఆర్‌ఏలు ఉన్నారు.



పొలంలో ఉల్లి రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఓ మల్లేష్‌కుమార్

సర్వేయర్ లేక అవస్థలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు విస్తీర్ణం పరంగా పెద్ద గ్రామాల్లో ఒకటి. ఇక్కడి గ్రామ సచివాలయంలో ఇద్దరు సర్వేయర్లు ఉండగా వీరిద్దరూ రీసర్వేలో భాగంగా ఇతర గ్రామంలో డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిహద్దు గ్రామం కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని బసాపురం, కళాపురం, భైరవాపురం గ్రామాల్లో ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. గ్రామంలో సచివాలయ సర్వేయర్లు లేనందున రైతుల పొలాల కొలతల్లో ఎదురైన సమస్యలను పరిష్కరించునేందుకు అవకాశం లేకుండా పోయింది. రైతు తన పొలాన్ని చట్టప్రకారం వారసులకు అందించాలంటే విడిభాగాలుగా తయారుచేయాలి. ఇందుకు గ్రామ సర్వేయర్ ఆ భూమిని కొలతలు వేసి మండల సర్వేయర్‌కు నివేదిస్తాడు. తరువాత ఆ భూమికి పాస్ పుస్తకాలు, కంప్యూటర్ ఆన్‌లైన్ మండల తహసీల్దారు ధ్రువీకరణ పూర్తవుతాయి. గ్రామ సచివాలయంలో సర్వేయర్లు అందుబాటులో లేనందున మండల కేంద్రానికి 13 కిలోమీటర్ల దూరం వెళ్లి కర్నూలు నగరంలోని మండల సర్వేయర్‌ను సంప్రదిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అక్కడ అధికారి అందుబాటులో లేకపోతే గంటల తరబడి వేచిచూడల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పొలం సరిహద్దు సమస్యలతో పాటు వ్యవసాయ భూములను కొన్నవారు, అమ్మిన వారు నిర్దిష్టమైన కొలతల కోసం సర్వేయర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా బి.తాండ్రపాడు, ఉల్చాల గ్రామ సర్వేయర్లు కూడా డెప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నందున ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామల రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇ.తాండ్రపాడు గ్రామానికి గతంలో మాదిరిగానే గ్రామ సర్వేయర్లను నియమించి సచివాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.